క్లుప్తంగా

పరిశీలన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకుడు హనీస్ చాప్రా

నెల్లిమర్ల: ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతులను నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు హనీష్ చాప్రా గురువారం పరిశీలించారు. స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలు నిర్వహిస్తున్న శిక్షణను హనీస్ చాప్రా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలంటే పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ బి. సుధాకర్, ఆర్ఓ ఎం. నూకరాజు, ఏఆర్ఓ డి. ధర్మరాజు,పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలో గ్రామీణ విద్యార్థుల సత్తా



సీహెచ్ వెంకట సిద్ధార్థ



కెల్ల జశ్వంత్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అలుగోలుకు చెందిన సీహెచ్ వెంకట సిద్ధార్థ, కొండవెలగాడ గ్రామానికి చెందిన కెల్ల జశ్వంత్ సత్తా చాటారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో సిద్ధార్థ 89 మార్కులు, జశ్వంత్ 84 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈమేరకు విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



36వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మహిళలు

విజయనగరం: అధికారమే పరమావధిగా చంద్రబాబు అండ్ కో విడుదల చేసిన మేనిఫెస్టోని నమ్మి మోసపోవద్దని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. వైఎస్సార్ సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా నగరంలోని 36వ డివిజన్ మజ్జిపేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రావణికి మద్దతుగా వందలాది మంది మహిళలు ప్రచారంలో పాల్గొనగా... ఇంటింటికి వెళ్లి కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా ప్రజాస్పందన అనూహ్యంగా వస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన, స్థానికంగా కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధే ఇందుకు కారణమని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కోలగట్లను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి, డివిజన్ మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు..

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోలింగ్ కోసం సిద్ధం చేసిన ఈవీఎం కిట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: పోలింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత పీఓ, ఏపీఓలపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించనున్న పీఓ, ఏపీఓలకు గరివిడిలో గల ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించి, పోలింగ్‌కు సిద్ధమైన ఈవీఎం కిట్లను పరిశీలించారు. అంతకుముందు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మే 13న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించిన నిబంధనలను పూర్తి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. పోలింగ్ నిబంధనలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఎలాంటి పొరపాట్లు జరగవని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి బాటలు

- 58 నెలల్లో 23 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, తారురోడ్ల నిర్మాణం
- రూ. 5.20 కోట్లతో నాలుగు తారురోడ్లు, రూ. 2.21 కోట్లతో 8 కిలోమీటర్ల సీసీ రోడ్ల ఏర్పాటు



మలిచర్ల గ్రామంలో రూ. 13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



రూ. 8 కోట్లతో నిర్మించిన బద్దుకొండపేట- గుండాలపేట- కొత్తూరు రోడ్డు



ఎంపీ నిధులతో నిర్మించిన బియ్యాలపేట రోడ్డు



నారాయణపురం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించడంతో పల్లె ప్రగతికి దోహదపడింది. ఇప్పటికే గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్, రైతుభరోసా కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేస్తుండగా, రహదారుల నిర్మాణానికి అంతే ప్రాధాన్యతనిచ్చి నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టడంతో పల్లె ప్రజల్లో ఆనందం తాండవిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం గ్రామీణ రహదారులపై చిన్నచూపు చూడడంతో అనేక ఏళ్లుగా పాడైన రహదారులతో ప్రజలు నరకయాతన పడ్డారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న విజయనగరం మండలంలో అనేక గ్రామాలను కలుపుతూ సుమారు 14 కిలోమీటర్ల మేర నాలుగు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో రూ. 5.20 కోట్ల వ్యయంతో తారు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే మండల పరిషత్ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో రూ. 2.21 కోట్లతో 9 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మండలంలోని బడుకొండపేట రోడ్డు పాడైతే గత ప్రభుత్వాలు నిధులు విదల్చకపోవడంతో సుమారు 2 కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుకొండపేట గ్రామం నుంచి కోరుకొండ పంచాయతీ కొత్తూరు వరకు రూ. 4.5 కోట్ల నిధులతో సుమారు 8.7 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే కోరుకొండపాలెం గ్రామం నుంచి గంట్యాడ మండలం పేదవేమలి జంక్షన్ వరకు 2.5 కిలోమీటర్ల తారురోడ్డు మరమ్మతులకు రూ. 35 లక్షల నిధులు మంజూరు చేయడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. సారిక గ్రామం నుంచి రైల్వేగేట్ వరకు 0.8 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తి చేశారు. మండలంలోని రాకోడు గ్రామం నుంచి పినవేమలి రోడ్డు జంక్షన్ వరకు సుమారు 1.8 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు రూ. 25 లక్షల నిధులు మంజూరు చేయగా వెంటవెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణాలు పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

8 కిలోమీటర్ల సీసీ రోడ్లు ..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సుమారు 7 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశారు. ఇందుకోసం రూ. 2.13 కోట్లు మంజూరు చేశారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ. 8.67 లక్షలతో 179 మీటర్ల మేర సీసీ రోడ్లు వేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి

- మరోసారి ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం
- వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి

ప్రచార పర్వం



18వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీతోనే పేద ప్రజల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఆ పార్టీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 18వ డివిజన్ హుకుంపేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్లకు స్థానిక ప్రజలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి, విజయ తిలకం దిద్దారు. మేయర్ విజయలక్ష్మి, కోలగట్ల కుమార్తె, అల్లుడు డాక్టర్ సంధ్య, డాక్టర్ నాగాభిషేక్‌తో కలిసి నిర్వహించిన ప్రచారంలో అడుగడుగునా జనం నిరాజనం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, మరోసారి తనను గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగరాన్ని అభివృద్ధి చేస్తూ కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఓవైపు జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన సాగుతుంటే, నగరంలో కోలగట్ల నేతృత్వంలో అభివృద్ధి పాలన నిరంతరాయంగా సాగుతోందన్నారు. కార్పొరేటర్ మీసాల రమాదేవి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నిరాదరణకు గురైన తమ డివిజన్, కోలగట్ల ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పయనించిందన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ లెంక వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల మధు, పిల్లా రామకృష్ణ, దేశెట్టి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అండగా నిలవాలి



భోగాపురం మండలం చాకివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: విద్య, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలు అందించి పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చాకివలస గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బడ్డుకొండకు హారతులు పట్టి పూలు జల్లుతూ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పేదలు, మహిళలను పట్టించుకోని చంద్రబాబు నేడు మరోసారి తప్పుడు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నాడని తెలిపారు. ప్రజలు తెలివిగా వ్యవహరించి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నెల్లిమర్ల ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాష్, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, పడాల శ్రీనివాసరావు, లంక రామునాయుడు, దంతులూరి రావాడబాబు, అప్పురభుక్త పైడినాయుడు, పూడిక నూకరాజు, కొండపు కొత్తయ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిన్ను నమ్మం బాబు..

చెప్పారంటే... చేస్తారంతే

ఎన్నికలు వచ్చాయంటే చాలు రాజకీయ నాయకులు ఎడాపెడా హామీలు ఇచ్చేస్తుంటారు.. కాని ఎవరు మాట మీద నిలబడతారు.. ఎవరు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారో చెప్పలేం.. కొంతమంది అర చేతిలో స్వర్గం చూపెడతారు. వీరు అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేరుస్తారో లేదో తెలియదు.. కాని ప్రజా సంక్షేమం కోరుకునే నాయకుడు మాత్రం అమలయ్యే హామీలే ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తాడు.. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు వందలాది హామీలు గుప్పిస్తున్నా... జనరంజక మేనిఫెస్టో ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి వైపే ప్రజలు ఉంటున్నారు. గతంలో ఆరు వందల హామీలు గుప్పించి ఏ ఒక్క హామీ అమలు చేయని చంద్రబాబును నమ్మమని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది లబ్ధిదారుల మనసులో మాటలివి... - సాక్షి నెట్‌వర్క్

చంద్రబాబును నమ్మితే మోసపోవడమే..



చంద్రబాబు నమ్మితే మోసపోవడమే. చంద్రబాబు తాజాగా ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను విశ్వసించలేం. వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తామని చెబుతున్నప్పటికీ ఎవ్వరూ నమ్మడం లేదు. 2014లో రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ హామీ నెరవేర్చలేదు. దగాకోరు చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తాడు. జగనన్న మాట ఇచ్చిన ప్రకారం నాలుగు విడతలలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారు. మా కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంజూరు చేసిన సంక్షేమ పథకాలన్నీ అందాయి.

- ఒనుము అసిరమ్మ, డ్వాక్రామహిళ , యాతపేట పూసపాటిరేగ.

చంద్రబాబు మేనిఫెస్టో పెద్ద మాయ



చంద్రబాబు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో పెద్ద మాయ. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటే ఏడాదికి లక్షల కోట్ల రూపాయలు అవసరమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే అయితే హామీలకు అన్ని లక్షల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు. జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. ఇప్పుడు కూడా జనరంజక మేనిఫెస్టో ప్రకటించారు. ఆయన చెప్పాడంటే కచ్చితంగా చేస్తాడన్న నమ్మకం ప్రజలందరికీ ఉంది.

- పెంటమాని రమణమ్మ, డ్వాక్రా మహిళ పూసపాటిరేగ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: సింహాద్రి చెరువు వద్ద 11కేవీ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు గుంకలాం లేవుట్, రామవరం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమానికి ఆకర్షితులై...

- వైఎస్సార్‌సీపీలో 80 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనకు ఆకర్షితులై పతివాడ, చినపతివాడ, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు టీడీపీ, జనసేనని వీడి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. అంబళ్ల రమణ, బెవర ఎర్రయ్య, రాజు, మేడ చినరాముడు, తదితరులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ నాయకుడు పతివాడ అప్పలనాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ మాట్లాడుతూ, నెల్లిమర్ల నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరిగాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, పడాల భానుప్రకాశరావు, అల్లాడ రమేష్, కోట్ల రఘు, మొంగం నాగబాబు, కొత్తకోట శ్రీరాములు, ఎం. లక్ష్మణరావు, పిన్నింటి నారాయణరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, పిన్నింటి కుమార్, పిన్నింటి ఎల్లంనాయుడు, పతివాడ సత్యం, పి. అప్పడుదొర, బర్రి దాసు , బర్రి అప్పలస్వామి, పతివాడ సూరిబాబు, ఎడ్ల రామకృష్ణ, తాటిశెట్టి బాబు, పైడి మధు, వాళ్లె సన్యాసినాయుడు, జనపాల అప్పారావు, టొంపల సీతారాం, డి. ఈశ్వరరావు, పట్టెపు శ్రీనివాసరావు, శాంతిటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత

- ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు



పెదతాడివాడ ప్రచార సభలో మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ప్రచార సభకు హాజరైన ప్రజలు

డెంకాడ: దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక చేయూత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు మండలంలోని పెదతాడివాలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజలు పోటెత్తడంతో విజయోత్సవ సభలా ఉందని బడ్డుకొండ అనడంతో ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేశారని చెప్పారు. పెదతాడివాడ అభివృద్ధిలో తన కృషి ఎంతో ఉందన్నారు. ఉన్నత పాఠశాల అభివృద్ధి మొదలుకుని.. ఇంటింటి కుళాయిలు, సీసీ రోడ్లు, తదితర అనేక మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట,సుఖాల్లో తోడుగా ఉన్నామని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు చేరువుగా ఉంటూ, వారి సంక్షేమం కోసం పని చేశారన్నారు. 2019లో పోటీ చేసిన తర్వాత కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జనసేన అభ్యర్థి లోకం మాధవి ప్రజలకు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. సౌమ్యుడు, మంచివాడు అయిన నెల్లిమర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జోన్-2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథరావు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుమజ్జి వెంకటరత్నం, గాదిపల్లి సంతోషి, బుగత రమణ, వెంపడాపు రమణ, ప్రజలు పాల్గొన్నారు.

బాబు మోసాలకు బలికావొద్దు ...

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని గజమాలతో సత్కరిస్తున్న ముడిదాం గ్రామస్తులు



సభకు భారీ ఎత్తున హాజరైన మహిళలు

విజయనగరం రూరల్: చంద్రబాబునాయుడు మేనిఫెస్టో చూసి మరోసారి ఆయన మోసాలకు బలికావొద్దని విజయనగరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. విజయనగరం మండలం బియ్యాలపేట, ముడిదాం, మలిచర్ల, సుంకరిపేట గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలటగ్ల మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో 600 అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించిన ఘనుడు చంద్రబాబునాయుడన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ అని ప్రజలను మోసగించడానికి సిద్ధమయ్యాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 58 నెలల పాలనా కాలంలో ప్రజలకు మంచి జరిగిందంటేనే ఓటెయ్యాలని, మీ ముందుకు ధైర్యంగా వచ్చి ఓట్లు అడగగలుగుతున్నామన్నారు. అవినీతిరహితంగా, రాజకీయాలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పల్లెల్లో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలు ఇంటివద్దనే అందించామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్లను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టి సన్యాసినాయుడు, నారంశెట్టి సత్తిరాజు, అలమండ అప్పలరాజు, బియ్యాల గౌరునాయుడు, కొసర నిర్మల, గండిబోయిన అప్పారావు, రమాదేవి, సన్నిబాబు, దుర్గరాజు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.